ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 05.12.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు వరంగల్ జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారు.

2. రాష్ట్రంలోని సివిల్స్ అభ్యర్థులు ఇంటర్వ్యూలు సమర్థంగా ఎదుర్కొనేలా ఒక ఇంటర్వ్యూ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

3. భారత రిజర్వ్ బ్యాంక్ కీలక వడ్డీ రేట్లను మరో 25 బేస్ పాయింట్లు తగ్గించింది.

4. రాష్ట్రంలో ఈనెల 11వ తేదిన జరగనున్న తొలి దశ ఎన్నికల్లో 395 సర్పంచ్ పదవులు ఏకగ్రీవం అయ్యాయి.

**సీఎం టూర్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు వరంగల్ జిల్లాలో పర్యటించనున్నారు. నర్సంపేటలో ప్రజాపాలన విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. మరిన్ని వివరాలు మా విలేకరి వీణా వాణి అందిస్తారు.

వాయిస్ కాస్ట్ - వీణావాణి

పిటిసి, వరంగల్

**అభయహస్తం**

రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కింద సివిల్ సర్వీసెస్ మెయిన్స్ , ఇంటర్వ్యూలకు ఎంతమంది ఎంపికైనా వారికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సివిల్స్ అభ్యర్థుల అభిప్రాయాలతో ఈ పథకాన్ని మరింత తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో యూపీఎస్సీ ఇంటర్వ్యూలకు ఎంపికైన 50 మందికి భట్టి విక్రమార్క నిన్న చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్స్ అభ్యర్థులు ఇంటర్వ్యూలను సమర్థంగా ఎదుర్కొనేలా ప్రభుత్వంలోని సీనియర్ బ్యూరోక్రాట్లతో ఇంటర్వ్యూ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఆర్థిక ఇబ్బందులతో సివిల్స్‌కు ఎంపిక కాలేకపోతున్న రాష్ట్ర యువతకు సింగరేణి ఆధ్వర్యంలో లక్ష రూపాయల ఆర్థిక సహాయంతో పాటు ఢిల్లీలో వసతి సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. గతేడాది 20 మంది ఇంటర్వ్యూలకు వెళ్లగా వారిలో ఏడుగురు సివిల్స్ కు ఎంపికయ్యారన్నారు.

జీఎస్

**ఏటీసీలు**

రాష్ట్రంలో కొత్తగా మంజూరు చేసిన 52 ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లుగా ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. తొలిదశలో 65 ఐటీఐలను ఉన్నతీకరించగా , రెండోదశతో కలిపి మొత్తం 117 ఏటీసీలు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. వీటిని టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. ఈ మేరకు గ్లోబల్ సమిట్‌లో టీటీఎల్‌తో తెలంగాణ కార్మికశాఖ రెండోదశ ఒప్పందం చేసుకోనుంది. తొలిదశలో ప్రారంభించిన ఏటీసీలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. వీటిల్లో ఆరు రకాల దీర్ఘకాలిక , 23 స్వల్పకాలిక ట్రేడ్‌లను ప్రవేశపెట్టింది. వీటిలో 11 వేల 8 సీట్లుండగా అన్నీ భర్తీ అయ్యాయి.

జీఎస్

**పొడగింపు**

గవర్నర్ పురస్కారాలకు నామినేషన్ల గడువును ఈనెల 15 వరకు పొడిగించినట్లు గవర్నర్ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శప్రాయమైన సేవలు చేసిన వ్యక్తులు, సంస్థలు, సొసైటీలు, ట్రస్టులను గుర్తించి వారికి పురస్కారాల ప్రదానం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మహిళా సాధికారత , గిరిజన అభివృద్ధి , గ్రామీణ ఆరోగ్యం-వైద్య సేవలు , కార్పొరేట్ స్వచ్ఛంద సేవ అంశాల్లో నామినేషన్లను ఆహ్వానిస్తున్నారు. ఆయా రంగాల్లో అర్హత కలిగి ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో డిసెంబరు 15 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించవచ్చని వివరించారు.

జీఎస్

**ఏసీబీ**

రాష్ట్రంలో అవినీతిపై ఫిర్యాదులకు క్యూఆర్ కోడ్ అందుబాటులోకి వచ్చింది. అవినీతి నిరోధక విభాగం డైరెక్టర్ జనరల్ చారుసిన్హా నిన్న క్యూఆర్ కోడ్ ఫిర్యాదుల వ్యవస్థను ప్రారంభించారు. అనంతరం అవినీతి నిర్మూలన నినాదాలతో కూడిన క్యూఆర్ కోడ్ పోస్టర్లను హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. డిసెంబరు 9న అంతర్జాతీయ అవినీతి నిరోధక దినాన్ని పురస్కరించుకుని వారోత్సవాలను ప్రారంభించామన్నారు. 9 వరకు జరిగే వారోత్సవాల్లో భాగంగా క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చాం. ఏసీబీ కార్యాలయాలకు దూరంగా ఉండే ప్రజలు సత్వరం ఫిర్యాదు చేసేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు.

జీఎస్

**నిధి**

సైనికులు ప్రమాదవశాత్తు గాయపడినా , దురదృష్టవశాత్తు అమరులైనా వారి కుటుంబాలకు ఆసరాగా నిలిచేందుకు ఏర్పాటైన సైనిక సంక్షేమ నిధికి ఈరోజు విరాళాలు సేకరిస్తున్నట్లు ఖమ్మం జిల్లా సైనిక సంక్షేమ అధికారి చంద్రశేఖర్ ఆకాశవాణికి చెప్పారు. సాయుధ దళాల దినోత్సవం సందర్భంగా ఖమ్మం సైనిక్ వెల్ఫేర్ ఆఫీసు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ...

Byte ... చంద్రశేఖర్, ఖమ్మం జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి

పిటిసి, ఖమ్మం

**టూర్ ఏర్పాట్లు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు నల్లగొండ జిల్లా దేవరకొండలో పర్యటిస్తారని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. హెలిప్యాడ్ తో పాటు, సభా ఏర్పాట్లను మంత్రి పర్యవేక్షించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అత్యంత వెనుకబడిన ప్రాంతమైన దేవరకొండను ముఖ్యమంత్రి దత్తత తీసుకునేలా విజ్ఞప్తి చేస్తామని మంత్రి అన్నారు.

పిటిసి, నల్గొండ

**పోలింగ్**

రాష్ట్రంలో ఈనెల 11వ తేదీన జరగనున్న తొలి దశ ఎన్నికల్లో 395 సర్పంచ్ పదవులు ఏకగ్రీవమయ్యాయి. ఈ ఎన్నికల్లో సర్పంచి , వార్డు సభ్యుల పదవులకు మొత్తం 81 వేల 20 మంది పోటీలో నిలిచారు. 4 వేల 236 గ్రామాల్లో తొలిదశ పోలింగ్ జరగనుండగా.. 395 గ్రామాల్లోని సర్పంచి పదవులు ఏకగ్రీవమయ్యాయి. 8 వేల 95 మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఐదు గ్రామాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. మిగతా 3 వేల 836 గ్రామాల్లోని సర్పంచి పదవులకు 13 వేల 127 మంది పోటీపడుతున్నారు. 149 వార్డుల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. 9వేల 331 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. వార్డు సభ్యులకు 9 వేల 626 మంది ఉపసంహరించుకున్నారు. మిగిలిన వార్డులకు సభ్యులుగా పోటీ చేసేందుకు 67 వేల 893 మంది పోటీలో నిలిచారు. ఇక, ఈనెల 14న జరగనున్న రెండో దశ ఎన్నికల్లో... 4 వేల 332 సర్పంచి పదవులకు 28 వేల 278 నామినేషన్లు దాఖలయ్యాయి. మరోవైపు.. మూడో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల దాఖలు గడువు ఈరోజుతో ముగియనుంది.

జీఎస్

**ఆర్‌బీఐ**

భారత రిజర్వ్ బ్యాంక్ - ఆర్ బీఐ కీలక వడ్డీరేట్లను మరో 25 బేస్ పాయింట్ల మేర తగ్గించింది. దీంతో రెపో రేటు 5.25 శాతానికి దిగొచ్చింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ ఉదయం వెల్లడించారు. రూపాయి పతనం కొనసాగుతున్నప్పటికీ ద్రవ్యోల్బణం కనిష్ఠ స్థాయికి పడిపోవడం , వృద్ధి రేటు పెరగడంతో రేట్ల కోత చేపట్టినట్లు మల్హోత్రా వెల్లడించారు. వడ్డీ రేట్లను తగ్గించడంతో గృహ , వాహన రుణ గ్రహీతలకు మరికొంత ఉపశమనం లభించినట్లు చెబుతున్నారు. కాగా.. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రెపో రేటు 1.25 శాతం వరకు దిగి వచ్చింది.

జీఎస్

**ఇండిగో**

ఇండిగో విమానాల రాకపోకల్లో అంతరాయం కలగడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మొత్తం 143 విమానాలు రద్దు చేసినట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఇందులో శంషాబాద్‌కు రావాల్సినవి 43 , ఇక్కడి నుంచి వెళ్లాల్సినవి 49 ఉన్నాయి. మరోవైపు విశాఖ పట్నం నుంచి 8 ఇండిగో విమాన సర్వీసులు రద్దు చేశారు. వీటికి తోడు ఈరోజు ఉదయం దుబాయ్ నుండి హైదరాబాద్ వస్తోన్న విమానానికి బాంబు బెదిరింపు ఇమెయిల్ వచ్చింది. ప్రామాణిక భద్రతా ప్రోటోకాల్‌లు ప్రారంభించిన తర్వాత విమానం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు హైదరాబాద్ లో సురక్షితంగా ల్యాండ్ అయింది.

జీఎస్

**డీజీపీ**

పోలీసు సిబ్బందికి మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ శివధర్ రెడ్డి అన్నారు. నిన్న నిర్మల్ , కామారెడ్డి జిల్లాల్లో పర్యటించిన డీజీపీ.. నిర్మల్ లో సిబ్బంది నూతన భవనాలను ప్రారంభించారు. కామారెడ్డిలో ఎన్నికల నిర్వహణపై సమీక్ష

సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. . ప్రజా సేవలో మరింత నిబద్ధతతో పనిచేయాలని అన్ని స్థాయిల అధికారులకు సూచించారు. శాంతియుత వాతావరణంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

కామారెడ్డి, నిర్మల్

**డీఎంహెచ్ వో**

ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని , నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న హాస్పిటల్ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని , రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య , ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. పలు ప్రైవేట్ ఆస్పత్రులలో తనిఖీలు నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ...

బైట్ - రజిత

పిటిసి, సిరిసిల్ల

**వాతావరణం**

ఉత్తర తమిళనాడు , పుదుచ్చేరి తీరాల సమీపంలో కేంద్రీకృతమై ఉన్న తీవ్ర అల్పపీడనం ఈరోజు ఉదయం పూర్తిగా బలహీన పడిందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. రాష్ట్రంలో రెండు రోజుల పాటు వాతావరణం పొడిగా ఉంటుంది వెల్లడించింది

పీఎన్

**నేల దినోత్సవం**

ఈరోజు ప్రపంచ నేల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఆరోగ్యకరమైన నేలల ప్రాముఖ్యతను గుర్తించడం , నేల జీవవైవిధ్యం , ఆహార భద్రత కోసం స్థిరమైన నిర్వహణపై అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. ఐక్యరాజ్యసమితి ఆహార , వ్యవసాయ సంస్థ

(FAO) దీనిని ప్రోత్సహిస్తుంది. 2014లో ఐక్యరాజ్యసమితి దీనిని ప్రారంభించింది. "ఆరోగ్యకరమైన నగరాలకు ఆరోగ్యకరమైన నేలలు" ఈ యేడాది ఇతివృత్తంగా ఉంది.

జీఎస్

**సైబర్**

సైబర్ నేరాలు నివారించడానికి ఆసిఫాబాద్ జిల్లాలో ఆరు వారాలపాటు "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ నితిక పంత్ తెలిపారు. మొదటి వారంలో "సైబర్ సారథి @1930" థీమ్ తో ప్రత్యేక అవగాహన చేపడుతున్నట్లు వెల్లడించారు. ఏదైనా సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

పిటిసి, ఆసిఫాబాద్

**వైకుంఠం**

ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. 30 వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా "ఉత్తర ద్వార దర్శనం" టికెట్లను ఈరోజు ఉదయం నుంచి ఆన్ లైన్ లో విక్రయిస్తున్నారు. 2 వేలు, 1,000, 500, 250 రూపాయల టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఆలయ ఈవో దామోదర్ రావు తెలిపారు.

పిటిసి, భద్రాద్రి

**ఆహ్వానం**

ఈనెల 8 , 9 తేదీల్లో "భారత్ ఫ్యూచర్ సిటీ"లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్"కు హాజరు కావాలంటూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య , ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను రాష్ట్ర ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిన్న బెంగళూరులో కలిసి సాదరంగా ఆహ్వానించారు.

జీఎస్